క్లుప్తంగా

మినీ స్టేడియం పనులు పూర్తిచేయాలి



చిట్యాల: మండల కేంద్రానికి మంజూరైనా మినీ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏబీవీపీ ప్రాంత కార్య సమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ మంగళవారం జిల్లా యువజన క్రీడల అధికారి లావుడ్య జయపాల్‌కు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. క్రీడాకారులకు పుట్టినిల్లుగా ఉన్న మండలంలోని మినీ స్టేడియం లేక అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. కావున మినీ స్టేడియం పనుల ను త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

పంట రుణాలు అందించాలి



రేగొండ: అర్హులైన రైతులకు పంట రుణాలు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి గ్రామ రైతులకు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని ఎస్‌బీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎక్కువ సిబ్బందిని కేటాయించి త్వరితగతిన రైతులకు రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ జూపాక నీలాంబారం, రైతులు ఉన్నారు.

'మారుమూల మండలంపై చిన్నచూపు'

కాటారం: మారుమూల మండలమైన మహాముత్తారంపై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చిన్నచూపు చూస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వరి కోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం శోచనీయం అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లేకపోవడంతో మండలంలోని పేద రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఓట్ల సమయంలో మాత్రమే మంత్రి శ్రీధర్ బాబుకు మండల ప్రజలు గుర్తుకు వస్తారని రైతులు ఇబ్బందులు పడుతుంటే మాత్రం పట్టించుకునేది లేదా అని ప్రశ్నించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



రేగొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎక్సెల్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందన్నారు. విద్యార్థులను ప్రయోజకులను చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. లక్ష్య సాధన కోసం ఎన్నో అవరోధాలను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, అసోసియేషన్ సలహాదారు కట్టంగూరు మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎస్ఎస్‌తాడ్వాయి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాటిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంతెన రాజు, దాసుల ఉదయలక్ష్మి, అరవింద్, పద్మ, పులి రజితకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన మంజూరు చేయించేలా మంత్రి సీతక్క కృషి చేస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మాజీ సర్పంచ్ బెజ్జురి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్ధి రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

ధ్వంసమైన వైకుంఠధామాలు



వరద ఉధృతికి ధ్వంసమైన టేకుమట్ల వైకుంఠధామం



అలంకారప్రాయంగా ఉన్న రాఘవరెడ్డిపేట వైకుంఠధామం

- పలు చోట్ల వరదలకు దెబ్బతిన్న వైనం
- వాగు, రోడ్ల వెంటనే మృతదేహాల ఖననం

టేకుమట్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.12.60లక్షల నిధులతో గత ప్రభుత్వం మండలంలో ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలు నిర్మించింది. కానీ వాటిని వినియోగించకపోవడంతో వైకుంఠధామాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 24 గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో టేకుమట్ల వైకుంఠధామం చలివాగు ఒడ్డుకు ఉండగా గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు చలివాగు ఉప్పొంగి పూర్తిగా ధ్వంసమైంది. ఆశిరెడ్డిపల్లి, అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల వైకుంఠదామాలు చలివాగు ఉధృతికి స్వల్పంగా శిథిలమయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో చెరువుల్లో నిర్మించడంతో అవి పూర్తిగా వినియోగంలోకి రాలేని పరిస్థితి దాపురించింది. మండలంలోని పంగిడిపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(టి), గర్మిళ్లపల్లి, ఎంపేడు, కుందనపల్లి మినహా ఎక్కడా వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురాలేదు.

ప్రభుత్వ స్థలాలు లేక..

కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో అధికారుల ఒత్తిళ్లతో గత సర్పంచ్‌లు చెరువుల్లో నిర్మించారు. దాంతో ఇప్పటి వరకు వాటి వైపు చూసిన దాఖలాలు లేవు. త్వరగా నిర్మించాలంటూ అధికారులు ఒత్తిడి చేయడంతో భవిష్యత్‌కు ఉపయోగపడకుండా నిర్మించారని, దాని వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని పలువురు మండిపడుతున్నారు.

ప్రధాన రోడ్ల వెంట, చలివాగులో ఖననం

మండలంలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించినా ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రధాన రోడ్ల వెంట, చలివాగులో ఖననం చేస్తున్నారు. మృతదేహాలను వైకుంఠధామాల్లోనే ఖననం చేయాలని అధికారులు అవగాహన కల్పించకపోవడం వల్లనే ఎక్కడపడితే అక్కడ ఖననం చేస్తున్నారు. ప్రధాన రోడ్ల వెంట ఖననం చేస్తున్న సమయంలో రోడ్ల వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చలివాగు, ప్రధాన రోడ్ల వెంట మృతదేహాలను ఖననం చేయకుండా వైకుఠధామాలను ఉపయోగించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చలివాగులోనే ఖననం..



వైకుంఠధామం పక్కనే వాగు ఉండడంతో మృతదేహాలను చలివాగులోనే ఖననం చేస్తున్నారు. చలివాగు నీటిని గ్రామాల్లోకి తాగునీటి కోసం పంపింగ్ చేస్తున్నారు కావున చలివాగులో దహన కార్యక్రమాలను నిలిని వేసి వైకుంఠధామంలో కొనసాగించాలి.

– గుర్రం నాగరాజు, అంకుషాపూర్

కట్టకింద దహనం..



మండల కేంద్రంలోని టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో గల చెరువు కట్టకు మృతదేహాలను ఖననం చేస్తున్నారు. దహనం చేస్తున్న సమయంలో రోడ్డు వెంట ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోని వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురావాలి.

–ఎరివెల్లి మహేష్, టేకుమట్ల

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత



కిరాణ షాపులో తనిఖీ చేస్తున్న డీఈ పాపిరెడ్డి

టేకుమట్ల: విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అని విద్యుత్ డీఈ పాపిరెడ్డి, సబ్ డివిజనల్ ఇంజనీర్ సందీప్ అన్నారు. మండలంలోని 11కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌ను మంగళవారం విద్యుత్ ఏఈ మణిదీప్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అన్ని విద్యుత్ స్తంభాల వద్ద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గృహవసరాలు, వాణిజ్య, పరిశ్రమ, వీధి దీపాల సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట చిట్యాల ఏఈ చంద్రశేఖర్, ఎస్ఈ శ్రీనివాస్, సంజయ్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

స్కావేంజర్లకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కావేంజర్లకు 11 నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వారికి వెంటనే చెల్లించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపేల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో స్కావేంజర్లకు జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందించాలని కోరారు. ఆయన వెంట తిరుమల, కల్యాణి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న మధు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కొడెల నర్సయ్య, ముచినిపర్తి గ్రామానికి చెందిన కందికొండ జంగలయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు పిట్ట సురేష్, ఎరుకోండ రాజేందర్ గౌడ్, రాజు, నర్సింగరావు, సాంబయ్య, నాగరాజు, వెంకన్న, రమణ, కొమురయ్య ఉన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన సత్యనారాయణ, నరసింహారామయ్య, శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, రామరావు, యాదగిరిరావు, మధుసూదన్‌రావు, రాజేశ్వర్‌రావు, సదానందం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ అంశం నమోదు చేయాలి



కాటారం: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



మొగుళ్లపల్లిలో..

కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సమగ్ర సర్వేలో భాగంగా జాబితాలో పేర్కొన్న ప్రతీ అంశాన్ని కుటుంబ సభ్యుల నుంచి సేకరించి నమోదు చేయాలని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు ఎన్యుమరేటర్లకు సూచించారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామ పంచాయతీలో పరిధిలో జరుగుతున్న సర్వేను మంగళవారం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి పరిశీలించారు. సర్వే తీరు, సేకరిస్తున్న వివరాలను ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లకు అస్కారం ఇవ్వకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కోసం ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఎంపీడీఓ కార్యాలయం, ఐకేపీ, ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ కేంద్రాలను పరిశీలించారు. సర్వే పూర్తి కాగానే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా సర్వే కార్యక్రమం నాలుగో రోజు మంగళవారం మండల వ్యాప్తంగా కొనసాగింది. సర్వేను మండల ప్రత్యేక అధికారి సునీత మొగుళ్లపల్లి, ఇస్సిపేట, గ్రామాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా మంగళవారం 874 కుటుంబాలను సర్వే చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ హుస్సేన్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్వేత

రేగొండ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ శ్వేత అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని చెన్నాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎస్సై సందీప్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. సేకరించిన ధాన్యం ప్రతీ రోజు మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

మొగుళ్లపల్లి: రైతు నుంచి ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్ తెలిపారు. మండలంలోని మొగుళ్లపల్లి, ఇస్సిపేట గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పీఏసీఎస్ గోడౌన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, గోడౌన్‌లో గన్నీ సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయాలు చేయొద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, డీసీఓ వాలియా నాయక్, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



రంగాపురంలో పొలంబాట నిర్వహిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ ఏఈ అడ్డగట్ల ప్రమోద్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి టెక్నికల్ డీఈ వెంకటేశం హాజరై మాట్లాడుతూ.. మండలంలోని రైతులు లోవోల్టేజ్ సమస్యలను నివారించడానికి కెపాసిటర్లను అమర్చుకోవాలన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ యాదగిరి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, లైన్‌మెన్ అనిల్, ఏఎల్ఎం మహిపాల్, ఆన్‌మ్యాన్డ్ వేముల కిరణ్ రైతులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మధుసూదన్

రేగొండ: బుగులోని జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యం అందేలా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అన్నారు. రేపటి నుంచి జరిగే బుగులోని జాతర సందర్భంగామండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మాస్కులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన మందులు ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హిమబిందు, సీహెచ్ఓ లింగారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



కమిటీలను ప్రకటిస్తున్న చంద్రమౌళి

పలిమెల: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేసిన అనంతరమే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలుపుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ మండల ఇన్‌చార్జ్ పత్తి మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాలలతో కుమ్మక్కైన సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అంశం పక్కకు పెట్టి ఉద్యోగ నోటిఫికేషన్లకు వెళ్లడం దుర్మార్గమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పోరాటంలో భాగంగా గ్రామస్థాయి నుంచి పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మార్పీస్, ఎంఎస్పీ, ఎంవైఎస్ కమిటీలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మహేష్, సదానందం, మధు, నవీన్, బాబు, శ్రీనివాస్, భిక్షపతి, రాజేందర్, తిరుపతి, దుర్గయ్య, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మొగుళ్లపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పలిమెల: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై దాడికి పాల్పడిన దోషులను వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ సర్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు దాడికి నిరసనగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ అనిల్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, ఇతర సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడంతో పాటు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగరాజు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, సర్వేయర్ వినీత్, జూనియర్ అసిస్టెంట్లు సతీశ్, శ్రీనివాస్, అజయ్, రాజశేఖర్, రమాదేవి, ఆపరేటర్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.



పలిమెల: నిరసన తెలుపుతున్న తహసీల్దార్ సర్వర్, సిబ్బంది

మొగుళ్లపల్లి: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఔషధ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులపై దాడికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: వికారాబాద్ జిల్లా దుబ్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌తో సహ తహసీల్దార్ ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ.. వికారాబాద్ కలెక్టర్, ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, ఆర్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



కాటారంలో..



రేగొండలో..

కోటంచ ఆలయంలో కార్తీక దీపోత్సవం



సామూహిక దీపారాధనలో పాల్గొన్న అధికారులు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి కార్తీక మాసం సామూహిక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున మహిళలు, దంపతులు పాల్గొని సామూహిక దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జోనల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు, సహాయ కమిషనర్ సునీత, ఈఓ మహేష్, అర్చకులు శ్రీనివాసచార్యులు, శ్రీనాథ్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410